క్లుప్తంగా

జయప్రదం చేయాలి

రఘునాథపల్లి: మేడే సందర్భంగా గ్రామ గ్రామాన ఎర్ర జెండాలు ఎగురవేసి వారోత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు పిలుపు నిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో బైరగోని బాలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ పొదల నాగరాజు, గంగాపురం మహేందర్, కదారి అంజనేయులు, రాజు, వెంకటయ్య, మల్లేష్, అంజయ్య, వెంకటయ్య, రమేష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

దేవరుప్పుల: తెలంగాణ పునర్నిర్మాణకర్త, సీఎం కేసీఆర్ నేతృత్వంలో శాశ్వతప్రాతిపదికన అభివృద్ధి, ఇంటింటా అందిన సంక్షేమ ఫలాలపై అవగాహన కల్పిస్తూ ఊరూరా పార్టీ వైభవాన్ని చాటాలని బీఆర్ఎస్ ప్లీనరీ ఇన్‌చార్జ్ బిల్లా సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ సాధన కోసం పుట్టిన టీఆర్ఎస్ దేశభవిష్యత్ కోసం విస్తరించిన బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టేలా మంత్రి దయాకర్‌రావు నాయకత్వానికి ఇక ఢోకాలేదన్న సంకేతాలు ఇచ్చేలా పెద్దఎత్తున పాల్గొని ప్రతినిధులు సైనికుల్లా ఊరూరా పార్టీ వైభవాన్ని చాటాలన్నారు.

చెక్కుల పంపిణీ

కొడకండ్ల: నిరుపేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసాగా ఇస్తుందని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సింధె రామోజీ అన్నారు. బుధవారం మండలంలోని రామవరం గ్రామానికి చెందిన మేటి సోమరాములు, నర్సయ్య, చిలుకమ్మలకు మంజూరైన రూ.57,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ మణెమ్మ, సొసైటీ వైస్ చైర్మన్ సోమరాములు, యాకూబ్, రేణుక, కుమార్, నర్సింహ్మస్వామి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ఈ నెల 29, 30 తేదీల్లో జనగామ పట్టణంలో నిర్వహించనున్న రజక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రజక వృత్తిదారుల సంఘం మండల నాయకులు నల్లతీగల చిరంజీవి, సిరికొండ ఉపేందర్, మాడరాజు సంతోష్ కోరారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, రజక కులస్తులు కలిసి బుధవారం వాల్ పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకుల సమస్యలను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకోసం సంఘం ఆధ్వర్యంలో జనగామ పట్టణంలో 29, 30 తేదీల్లోలో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు గుడికందుల యాకయ్య, నల్లతీగల యాకయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎంపీపీకి సమ్మె నోటీసు

పాలకుర్తి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబెషనరీ పీరియడ్ ముగిసినా క్రమబద్ధీకరించకపోవడంతో ఈ నెల 28న సమ్మెకు వారు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమ్మె చేయనున్నట్లు ఎంపీపీ నల్ల నాగిరెడ్డికి పంచాయతీ కార్యదర్శులు నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పీఎస్ యుగేందర్, పంచాయతి కార్యదర్శులు రమ్య, చుక్కా, లింగయ్య, మహేష్, శ్రీకాంత్, సంగీత, శిరీష ఉన్నారు.

చిన్నారులపై కుక్కల దాడి



జనగామ: పట్టణంలోని జయశంకర్‌నగర్, వీవర్స్ కాలనీ(11,12వ వార్డు)లో బుధవారం కుక్కలు ఆడుకుంటున్న నలుగురు చిన్నారులపై దాడి చేశాయి. స్థానికులు స్పందించడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. గాయాల పాలైన నాలుగేళ్ల లిఖిల్‌తో పాటు భవ్యశ్రీ, మరో ఇద్దరిని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

బచ్చన్నపేట: కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని కొన్నెలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చీర కొమురయ్య మంగళవారం రాత్రి జీవాలను తన దొడ్డిలో తోలి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి కుక్కలు మందపై దాడి చేయడంతో నాలుగు గొర్రె పిల్లలు మృతిచెందగా, పలు జీవాలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో దాదాపు రూ.50 వేల నష్టం జరిగిందని బాధిత కాపరి వాపోయాడు.

ఉపాధి కూలీల చేతిలో కొండచిలువ హతం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కోమటిగూడెంలో ఉపాధి హామీ పథకం కూలీల చేతిలో కొండచిలువ హతమైన సంఘటన బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులోని మంచంగుట్ట వద్ద ఉపాధి హామీ కూలీలు పనిచేస్తుండగా కొండచిలువ వచ్చింది. దీంతో ఒక్కసారిగా కూలీలు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. అనంతరం కొందరు కూలీలు దానిని చంపారు. మిగిలిన కూలీలు ఊపిరిపీల్చుకున్నారు.

దెబ్బ మీద దెబ్బ..

- వెంటాడిన వడగళ్ల వాన
- మంగళవారం రాత్రి మళ్లీ బీభత్సం
- తుడిచిపెట్టుకుపోయిన పంటలు

అన్నదాత ఆశలు ఆవిరయ్యాయి. రెక్కల కష్టాన్ని వరుణుడు తుడుచుకుపెట్టుకుపోయాడు. జిల్లాలో శనివారంతో మొదలైన వడగళ్లవాన బీభత్సం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే చాలా వరకు వరి, మొక్కజొన్న పంటలు, మామిడి తోటలు ధ్వంసమయ్యాయి. మంగళవారం రాత్రి మళ్లీ గాలివానతో కురిసిన వడగళ్ల కారణంగా ఆరు మండలాల్లో మిగిలి ఉన్న పంటలు పూర్తిగా చేతికి రాకుండా పోయాయి. కొనుగోలు కేంద్రాలు, కల్లాలపై ఉన్న ధాన్యం నీటిపాలైంది. పిడుగులతో పశువుల ప్రాణాలు పోయాయి. ఇళ్లు, కొట్టాలు నేలమట్టమయ్యాయి. బుధవారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో నష్టాన్ని పరిశీలించడానికి వెళ్లగా రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

– రఘునాథపల్లి/నర్మెట/తరిగొప్పుల/బచ్చన్నపేట/కొడకండ్ల/జఫర్‌గఢ్

● రఘునాథపల్లి మండల పరిధి మంగళిబండతండా, ఆంధ్రాతండా, మేకలగట్టు, ఖిలాషాపూర్, గిద్దబండతండా, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్, మాధారం గ్రామాల్లో పొలంలోని వరి గింజలు నేలపాలయ్యాయి. తోటల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిసి ముద్దయ్యాయి. ఆరబోసిన ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. వడగళ్లతో ఎనమిది గ్రామాల్లో సుమారు 1,700 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. చేతికొచ్చిన పంటను వరుణుడు నోటికి అందకుండా చేశాడంటూ.. బాధిత రైతులు గుగులోతు దూళి, భిక్షమ్మ, కమిలి, సునావత్ అక్కి, రాజమ్మ, వీరమ్మ, సత్తెమ్మ, రేణుక, లక్ష్మి తదితరులు కన్నీటి పర్యంతమయ్యారు. పంటలకు చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ బోరుమన్నారు.



రఘునాథపల్లి : మంగళిబండతండాలో రోదిస్తున్న బాధిత రైతులు

● తరిగొప్పుల మండలకేంద్రంతో పాటు అక్కరాజుపల్లి, పోతారం, మరియారం, సోలిపురం గ్రామాల్లో ధాన్యపు గింజలు పొలాల్లో రాలిపోయాయి. 700 ఎకరాల్లో వరి, 40 ఎకరాల్లో మొక్కజొన్న, 55 ఎకరాల్లో మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. వర్ష బీభత్సవానికి పోతారం గ్రామంలో శాతర్ల రాజుకు చెందిన పశువులకొట్టం ధ్వంసమైంది. బుధవారం తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి సంతోషి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

● బచ్చన్నపేట మండలంలోని రెండు, మూడు జీపీలు మినహా 26 గ్రామాల్లో వడగళ్ల వానతో వరి పంటలు, మామిడి తోటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పలు గ్రామాలలో పిడుగు పాటుకు పశువులు చనిపోయాయి. మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో దూసరి బాలమ్మకు చెందిన రూ.లక్ష విలువైన పాడి గేదె పిడుగు పడి చనిపోయింది. పాత ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఇళ్లపై ఉన్న రేకుల కప్పులు ఎగిరిపోయాయి.

● కొడకండ్ల మండల కేంద్రంతో పాటు ఏడునూతుల తదితర గ్రామాల్లోని కేంద్రాలకు రైతులు విక్రయానికి తెచ్చిన ధాన్యం ఆరబోయగా వర్షానికి పూర్తిగా తడిసిపోయింది. 20 రోజుల క్రితం వరి కోతలు మొదలు పెట్టిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. నాలుగు రోజులుగా పొద్దంతా ధాన్యాన్ని ఆరబోసుకోవడం.. రాత్రయితే వర్షం భయంతో కుప్పలు చేసుకుంటూ కంటిమీద కునుకులేకుండా కాపాడుకున్నారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో ఇన్ని రోజులు పడిన కష్టం నీటిపాలైందని రైతులు వాపోయారు.



బచ్చన్నపేట: కట్కూరులో రాలిన మామిడి కాయలను చూపిస్తున్న కౌలురైతు చిట్టిబాబు



నర్మెట: అమ్మాపురంలో మామిడితోటను పరిశీలిస్తున్న అధికారులు



తరిగొప్పుల : అక్కరాజుపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్



బచ్చన్నపేట: బసిరెడ్డిపల్లిలో మృతి చెందిన గేదె

25వ తేదీ రాత్రి వడగళ్ల బీభత్సంతో పంట నష్ట వివరాలు (ఎకరాల్లో)

మండలం	గ్రామాలు	రైతులు	వరి	మొక్కజొన్న	మామిడి	మొత్తం
స్టేషన్‌ఘన్‌పూర్	07	181	335	25	80	440
చిల్పూరు	01	165	355	-	-	355
లిం.ఘనపురం	05	248	530	12	-	542
ర.నాథపల్లి	08	899	1,761	-	-	1,761
పాలకుర్తి	01	07	15	-	-	15
కొడకండ్ల	04	66	60	-	04	64
నర్మెట	08	3,520	6,900	195	640	7,770
తరిగొప్పుల	04	420	1,050	-	91	1,141
జనగామ	04	352	500	-	245	745
మొత్తం	42	5,858	11,506	232	1,060	12,833

యోగాతో మానసిక ప్రశాంతత

బచ్చన్నపేట: ప్రతి మనిషి వయస్సుతో సంబంధం లేకుండా రోజూ యోగా చేయాలని, దాంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అచలయోగా ఫౌండేషన్ యోగా గురువు మల్లేశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఫౌండేషన్ ఆశ్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి జూన్ 7వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులను ఆశ్రమంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. పురుషులకు ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు, మహిళలకు సాయంత్రం 6–7 గంటల వరకు 45 రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను వినియోగించుకోవాలన్నారు. శిక్షణ కోసం పేర్లను ఆశ్రమంలో నమోదు చేసుకోవాలని సూచించారు. శాంతయ్య, రామచంద్రం పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'



చిల్పూరు: తెలంగాణలో ఎవరూ అంధత్వంతో బాధపడొద్దని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసిందని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని వెంకటేశ్వరపల్లెలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎంపీటీసీ ఎన్నకూస కుమార్, సర్పంచ్ దివాకర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి డాక్టర్లు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాపై సర్వే బృందాల పర్యటన

లింగాలఘణపురం: ఇటీవల మండలంలో వడగళ్లు, అకాల వర్షాలతో ధ్వంసమైన పంటలపై నష్టాన్ని అంచనా వేసేందుకు ఈ నెల 27 నుంచి రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులతో ఏర్పాటైన బృందాలు గ్రామాల్లో పర్యటిస్తున్నాయని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. నష్టపోయిన రైతులు తమ పంట పొలాల వద్ద అందుబాటులో ఉండాలని అన్నారు. మండలంలో 500 ఎకరాల్లో వరి, 25 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాలకు పైగా మామిడి తోటలకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి టౌన్: వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ డి.విశ్వేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండ వేడి నుంచి సేదదీరడానికి సరదా కోసం తోటి స్నేహితులతో కలిసి సమీపంలో చెరువులు, కుంటలు, బావుల వద్దకు ఈతకు వెళ్లకుండా తల్లిదండ్రులు చుసుకోవాలన్నారు.

ఎకరాకు రూ. 40 వేల నష్టపరిహారం ఇవ్వాలి



రఘునాథపల్లి: మాట్లాడుతున్న అవినాష్‌రెడ్డి

రఘునాథపల్లి/బచ్చన్నపేట: అకాల వర్షం, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 40 వేల చొప్పున పరిహారం చెల్లించాలని రాష్ట్ర కిసాన్ సెల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రఘునాథపల్లి, బచ్చన్నపేట మండలాల్లో పలు గ్రామాల్లో వడగండ్లతో నష్టపోయిన పంటలను బాధిత రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు కొనుగోళ్లు ప్రారంభించి వదిలేశారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసి 20 రోజులవుతున్నా కొనుగోళ్లు చేస్తలేరని, టార్పాలిన్లు ఇవ్వడం లేదని, వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యాన్ని కాంగ్రెస్ నాయకులకు చూపించారు. అవినాష్‌రెడ్డి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతుల కష్టాలను వివరించారు. ఆయన వెంట నాయకులు లింగాల సుభాష్‌చందర్‌రెడ్డి, మానసపల్లి లింగాజీ, నారాయణరెడ్డి, కోళ్ల రవిగౌడ్, వంచ వెంకట్‌రెడ్డి, నిడిగొండ శ్రీనివాస్, పిన్నింటి నారాయణరెడ్డి, జంగిటి నరేష్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పరిశీలన

దేవరుప్పుల: మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు తేమశాతం పరిశీలించారు. బుధవారం కామారెడ్డిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏఈఓ సూదగాని సాగర్ తేమశాతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కొనుగోలు కేంద్రానికి చేర్చిన ధాన్యం తేమశాతం సరిచూసి సత్వరమే కాంటాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ బిల్లా అంజమ్మ, ఐకెపి, పీఎసిఎస్ మండల అధికారులు వెంకట్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఏఈఓలు సాయికిరణ్, భాస్కర్, అరుణశ్రీ, సంతోష్ ఉన్నారు.

ఆర్థికసాయం



పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లికి చెందిన గంగారపు మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బుధవారం మహాత్మా గాంధీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుడు జి.తిరుమల్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతుబాంధవుడిగా, రైతుల పక్షపాతిగా పనిచేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సెర్ప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వియోగం చేసుకోవాలని, చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సర్పంచ్ గోవిందు ఆనందం, ఎంపీటీసీ బెల్లపు వెంకటస్వామి, ఉపసర్పంచ్ మహేందర్, ఐకేపీ ఏపీఎం కవిత, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగస్వామి, అశోక్, జ్యోతిరెడ్డి, మౌనిక, ప్రగతి పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రఘునాథపల్లి: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉందని, బాధిత అన్నదాతలందరిని ఆదుకుంటామని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. బుధవారం మండలంలోని మేకలగట్టు, మంగళిబండతండాలో వడగండ్లతో దెబ్బతిన్న వరి పంటలను ఎమ్మెల్యే పరిశీలించారు. వడగండ్లతో పంటలు దెబ్బతిన్న రైతులు తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఖిలాషాపూర్‌లో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అకాల వర్షాలతు పంటలు దెబ్బతిన్న బాధిత రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోషా ఇచ్చారు. కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్, మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్, సర్పంచ్ నోతు వెంకట్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

బచ్చన్నపేట: అన్నదాతలు పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు కాకుండా ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దూడల కనుకయ్య అన్నారు. బుధవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇటుకాలపల్లిలో, ఐకేపీ ఆధ్వర్యంలో సాల్వాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్‌లు కీసర లక్ష్మి, నాగిరెడ్డి రజిత, ఎంపీటీసీ గూడెపు లతశ్రీ, ఉప సర్పంచ్‌లు విజయలక్ష్మి, బియ్య అశోక్, సీసీ నర్సింహులు, బాగులు, తిరుపతి, వెంకట్‌రెడ్డి, వీఓఏలు విజయలక్ష్మి, రేణుక, సభ్యులు లావణ్య, కవిత, పద్మ, వాణి, రజిత, లక్ష్మి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

చిల్పూరు: గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సర్పంచ్ కేశిరెడ్డి ప్రత్యూషారెడ్డి రైతులను కోరారు. మండలంలోని శ్రీపతిపల్లిలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచ్ గొంగిడి అనూరాధకృష్ణమూర్తి, మార్కెట్ డైరెక్టర్ రంగు హరీష్, నాయకులు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, కొంరయ్య, గడ్డం సిద్ధయ్య, రాందాసు ఉన్నారు.

'అంగన్‌వాడీ'లను వినియోగించుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాటికొండ సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటికొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో స్కూల్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపసర్పంచ్ మారపాక రాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, పద్మ, అరుణ, రంగమ్మ, ప్రభావతి, సులోచన, లలిత, ఆయాలు, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఛాగల్లులో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో ఘనంగా స్కూల్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ ఫ్లోరెన్స్, సర్పంచ్ పోగుల సారంగపాణి, ఉపసర్పంచ్ పొన్న రజితరాజేష్, ఎంపీటీసీ కనకం స్వరూపగణేష్, అంగన్‌వాడీ టీచర్లు అరుణ పాల్గొన్నారు.

రఘునాథపల్లి: కంచనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్‌డేను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గవ్వాని విజయనాగేశ్వర్, ఎంపీటీసీ కేమిడి రమ్యరాజు పాల్గొని మాట్లాడారు. కంచనపల్లిలో కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, సౌందర్య, సరోజ, రాజేశ్వరి, మమత పాల్గొన్నారు. అలాగే మండలంలోని వెల్ది అంగన్‌వాడీలో స్కూల్‌డే నిర్వహించారు.

జఫర్‌గఢ్: గ్రామాల్లో అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు శిరబోయిన సంధ్య కోరారు. మండలంలోని కూనూర్‌లో అంగన్‌వాడీ స్కూల్ డే ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పిల్లలకు సర్టిఫికెట్లను అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల 1978–79 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 45 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఏకమై ఒకే చోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నర్సింహారెడ్డితో పాటు తమ గురువులను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సన్మానించారు.

అన్నదాతలను ఆదుకోండి

రఘునాథపల్లి: అకాల వర్షాలతో నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి మండలంలోని ఆంధ్రతండాలో వడగండ్లు, ఈదురు గాలులతో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. పంటలు కొల్పోయి రోదిస్తున్న బాధిత రైతులను ఆయన ఓదార్చారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రైతులు పంటలు కొల్పోయి కన్నీరు పెడుతుంటే.. ఎమ్మెల్యే, మంత్రులు, బీఆర్ఎస్ నాయకులు ప్లీనరీల పేర డీజేలతో సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. బాధిత రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందజేసి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వల్లాల వెంకటేష్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్, బాధిత రైతులు పాల్గొన్నారు.

కొడకండ్ల: వడగండ్ల వర్షాలకు నష్టపోయిన రైతులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెదగాని సోమయ్య, రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ఉపేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని, లేనిచో వారి పక్షాన ఉద్యమాలు చేస్తామని వారు తెలిపారు. నియోజకవర్గ కన్వీనర్ శ్రీమాన్, జిల్లా కార్యదర్శి మోడపల్లి సోమన్న, కోటేశ్వర్‌రావు, చింత సృజన్, నవీన్‌రెడ్డి, సత్తయ్య



రఘునాథపల్లి: పంట దెబ్బతిన్న మహిళా రైతును ఓదారుస్తున్న వెంకటేష్ తదితరులు



లింగాలఘణపురం: మాట్లాడుతున్న జనార్దన్

తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలి

లింగాలఘణపురం: వడగళ్లు, అకాల వర్షంతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగంపల్లి జనార్దన్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నెల్లుట్లలో వ్యవసాయ కార్మిక సంఘం మండల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్ మాట్లాడుతూ అధికారులు వెంటనే పంట నష్టంపై సర్వే నిర్వహించి తక్షణ సహాయం అందజేసి అన్నదాతలకు బరోసా కల్పించాలని కోరారు. మొటికె యాదగిరి, పీ. వీరస్వామి, బి. అంజయ్య, కొంరయ్య, రవి, రాంనర్సయ్య, శ్రీనువాసు, సోమయ్య, వెంకన్న, పరశురాములు, వెంకట్రామిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

జనగామ రూరల్: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఏబీవీ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవిప్రసాధ్ అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బెన్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ రవితేజ, హరికృష్ణ కార్డియో పల్మనరీ రిససిటేషన్‌ని ప్రయోగపూర్వకంగా విద్యార్థులకు వివరించారు. ఈ ప్రక్రియతో తోటి వారి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కనగాల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, ఏఓ సులేమాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

గొల్లపల్లి రైతులకు బాసటగా నిలవాలి

దేవరుప్పుల : తెలంగాణ మలివిడత ఉద్యమానికి దిక్సూచిగా పేరొందిన కాసోజు శ్రీకాంతాచారీ స్వగ్రామమైన గొల్లపల్లి రైతుల సమస్యలు తీర్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం బాసటగా నిలువాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగు నీటి కాల్వల భూసేకరణ విషయ నిర్ణయాల్లో సదరు యంత్రాంగం చూపే వివక్షత, నిర్లక్ష్యవైఖరి సరికాదన్నారు. గొల్లపల్లి చెరువుకు కాల్వనిర్మాణం ద్వారా సాగునీటి కల్పన కోసం సేకరించిన భూమిలో అక్రమ కట్టడాలను నిలువరించడంలో ప్రభుత్వ పర్యవేక్షణ అధికారులు తీవ్ర వైఫల్యం పొందారని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బాగాల నవీన్‌రెడి, నాయకులు కాసాని సత్తయ్య, గుంటి అజయ్య, బండి రాజు, దూడల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

సెల్‌ఫోన్ అప్పగింత



రఘునాథపల్లి: ఓ పంచాయతీ కార్యదర్శి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా రఘునాథపల్లి పోలీసులు సీఈఐఆర్ ద్వారా దానిని ట్రేస్ చేసి అప్పగించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని భాంజీపేట గ్రామానికి చెందిన అంతగళ్ల కుమారస్వామి తరిగొప్పుల మండలం కొత్తతండా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 21న కుమారస్వామి తన ద్విచక్రవాహనంపై విధులకు వెళ్తుండగా ఖిలాషాపూర్ కస్తూర్బా సమీపంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు దానిని బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి బుధవారం మరో సిమ్‌కార్డు వేసుకోగా పోలీసులు వెంటనే టవర్ లోకేషన్ ఆదారంగా గుర్తించి రికవరీ చేశారు. ఫోన్ విలువ రూ.20 వేలని పోలీసులు తెలిపారు. ఫోన్‌ను గుర్తించి అందజేసిన ఎస్సై ఎస్ వీరేందర్‌కు పంచాయతీ కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న కొమురయ్య

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గంలో బలమైన ఎమ్మెల్యే అభ్యర్థిని పంపిస్తామని, కాంగ్రెస్ కార్యకర్తలు అధైర్య పడొద్దని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈర్ల కొమురయ్య అన్నారు. బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, నియోజకవర్గ కార్యకర్తలు,ప్రజల సమస్యలను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని కార్యకర్తలు హామీ ఇచ్చారు. టీపీసీసీ సభ్యులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్, పాలకుర్తి,తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, జాటోత్ మహ్యానాయక్, సాంస్కృతిక రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు పాల్గొన్నారు.